ప్రజాశక్తి
శనివారం 12 ఏప్రిల్ 2025
5
కర్నూలు





నివాళులర్పిస్తున్న అతిథులు

కబ్జా కోరల్లో 'హంద్రీ'

- రోజురోజుకూ పెరుగుతున్న ఆక్రమణలు
- నగరంలోని మురుగూ అందులోకే
- మంత్రి నియోజకవర్గమైనా శ్రద్ధ కరువు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగరం నడిబొడ్డుగుండా ప్రవహిస్తూ, నగరాన్ని రెండుగా విభజిస్తూ, కర్నూలు జిల్లాలోనే పుట్టి కర్నూలులో అంతమయ్యే చిన్ననది హంద్రీనది. హంద్రీ నది పూర్తి పేరు హైంద్రావతి నది. కాల క్రమేన హంద్రి నదిగా స్థిర పడిపోయింది. ఈ నది పైనే గాజులదిన్నె గ్రామం వద్ద ప్రాజెక్టు కట్టబడి ఉంది. ఈ నది పత్తికొండ సమీపంలోని కొండలలో పుట్టి దాదాపు 130 కిలోమీటర్లు ప్రవహించి కర్నూలు నగరం పాత టౌన్ జోరాపురం వద్ద తుంగభద్ర నదిలో కలుస్తుంది. గతంలో ఈ నదిలోని నీరు మంచి నీటితో దర్శనమిచ్చేంది. నేడు హంద్రీనది కబ్జా కోరల్లోకి వెళ్లిపోతోంది. రోజు రోజుకూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. మరో వైపు నగరంలోని మురుగు అంతా అందులోకే పోతుండటంతో మురికి నీరు ప్రవహించే నదిగా మారి పోయింది. మంత్రి నియోజకవర్గంలో ఉన్నా దానిపై శ్రద్ధ కరువైంది...



కర్నూలు నగరంలో ప్రవహించే హంద్రీ నదిని పురాణాల్లో హైంద్రావతిగా పిలిచేవారు. కర్నూలు జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో మద్దికేర మొగలవల్లి నాంచార్ల గ్రామాల్లో ఈ నది జన్మించింది. దాదాపు 16 కిలోమీటర్లు ప్రవహించి కర్నూలు జమ్మి చెట్టు ప్రాంతంలో తుంగభద్రా నదిలో కలుస్తుంది. ఈ నదిలో ఒక్కెర వాగు, మల్లి వాగు, పాలహింద్రి, నల్ల వంక వంటి వాగులు కలుస్తాయి. ఈ నది దాదాపు 50 గ్రామాలకు తాగునీరు, సాగునీటిని అందిస్తుంది. గతంలో నీటితో కళకళలాడే ఈ నది కబ్జా కోరల్లో కొట్టుమిట్లాడుతోంది. హంద్రీ నది కబ్జాకు గురైన ప్రాంతాలు. హంద్రీ నది ప్రారంభం నుండి అంతం వరకు ప్రధానంగా కబ్జాకు గురైంతి. కర్నూలు, కల్లూరు ప్రాంతంలో పందిపాడు వద్ద ఫ్యాక్టరీలు, ముజఫర్ నగర్, దేవన గారు వద్ద గల విఠల్ నగర్, టైలర్స్ కాలనీ, కిసాన్ ఘాట్, గౌరీ గోపాల్ వద్ద, హబీబ్ ముబారక్ నగర్, బుధవార్ పేట ప్రాంతాల్లో హంద్రీ నది కబ్జాలకు గురైంది. రోజు రోజుకూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. తాజాగా కర్నూలు ఆనంద్ థియేటర్ ఎదురుగా, కెఇ మాదన్న నగర్ పక్కన హంద్రీ నదిని ఆక్రమించుకొని పార్కును నిర్మిస్తున్నారు. గతం నుంచే రాజకీయ నాయకుల అండదండలతో హంద్రీనది ఒడ్డున రాజకీయ నాయకులు పెద్దపెద్ద భవంతులు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. పేదలు ఉండడానికి ఇల్లు లేక చిన్న గుడిసె వేస్తే పట్టణ ప్రణాళిక విభాగం వారు వారిని భయపెట్టి తొలగిస్తున్నారు. అదే రాజకీయ నాయకుల జోలికి వెళ్లరు. పేదలు చేస్తే తప్పు పెద్దలు చేస్తే ఒప్పు అన్న విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. మరో వైపు కర్నూలు నగరంలో పనిచేసే నగరపాలక సంస్థ అధికారుల ఇంజనీర్ల నిర్లక్ష్యంతో నగరంలోని డ్రైనేజి నీటిని అంతా హంద్రీనదిలోకి వదులుతున్నారు. అంతిమంగా డ్రైనేజి కాలువగా హంద్రీనది మారిపోయింది. హంద్రీ పరిసర ప్రాంతాలలో నివసించే చాలా మంది బహిర్భూమికి వెళ్లడంతో పాటు ఇళ్లలోని చెత్త వేయడం, చనిపోయిన చనిపోయిన జంతువులను, అలాగే కభేలాల నుండి వచ్చే వ్యర్థాలను కూడ హంద్రీనదిలో వేయడం వల్ల హంద్రీనది కాలుష్యం అవుతోంది. హంద్రీ నది పరిసర ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, వారి అనుయాయులు హంద్రీలోనే ఏకంగా భవంతులను కడుతున్నారు. దాంతో హంద్రీనది విస్తీర్ణం తగ్గి వరదలు వచ్చినపుడు నీరు ఇళ్లలోని చేరుతోంది. మంత్రి నియోజకవర్గమైనా శ్రద్ధ చూపడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణల నుండి కాపాడాలి



- వి.వెంకటేశ్వర్లు, పట్టణ పౌర కమిటీ సభ్యులు.

హంద్రీనదిని ఆక్రమణల నుంచి కాపాడాలి. కర్నూలు నగర ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించాలి. హంద్రీలో కలిసే మురికి నీటికి ప్రత్యేకంగా హంద్రీ నదికి కుడి ఎడం వైపు ప్రత్యేక మురుగు కాల్వను ముజఫర్ నగర్ నుండి జమ్మి చెట్టు వరకు నిర్మించాలి. అక్కడినుండి జమ్మిచెట్టు వరకు హంద్రీ నదిలో చెట్లు తొలగించి శుభ్రం చేయాలి. మంత్రి ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలి.

జిల్లా అధికారులు స్పందించాలి



జిల్లా యంత్రాంగం హంద్రీ స్థలాన్ని జియో ట్యాగింగ్ చేయాలి. అది జరగలేదు. క్రమంగా అందరి నీళ్ల లోపలికి చొచ్చుకుపోయాయి. లక్ష్మీపురం నుంచి జోహారపురం వరకు నది పరివాహక ప్రాంతం 60 నుంచి 70 శాతం ఆక్రమణలకు గురైంది. చెత్త వేసే పేరుతో నదిని పూడ్చి నదిని ఆక్రమిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం నదీ పరివాహక ప్రాంతాన్ని రక్షించడం అధికార యంత్రాంగం బాధ్యత. అది జరగడం లేదు. జల వనరుల శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, కుడా హంద్రీకి ఆనుకుని ఉన్న వాటికి అనుమతులు ఇవ్వకూడదు. రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ కూడా పరిశీలన చేయాలి. నదిలోకి చెత్త వేయకుండా, మురుగునీరు రాకుండా చూడాలి. వరద గోడ నిర్మించాలి. జిల్లా అధికార యంత్రాంగం స్పందించాలి. జియో ట్యాగింగ్ చేసి రక్షించాలి.

- ప్రొఫెసర్ మన్సూర్ రెహమాన్, సేవ్ హంద్రీ కన్వీనర్

పూలే ఆశయ సాధనకు పునరంకితమవుదాం

- సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు
- మహాత్మజ్యోతిబాపూలే జయంతి సభలో కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా కొనియాడారు. ఆయన ఆశయసాధనకు అందరం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు బిర్లా గేట్ వద్ద మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ , కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, 1827 ఏప్రిల్ 11న జన్మించిన మహాత్మా జ్యోతిబా పూలే గురించి దాదాపు 198 సంవత్సరాల తర్వాత కూడా మాట్లాడుకుంటూ, ఆయన జయంతిని రాష్ట్రమంతా, దేశమంతా ఒక పండుగలా చేసుకుంటున్నామంటే, ఖచ్చితంగా ఆయన సమాజానికి ఎంతో మేలు చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అలాంటి మహనీయుని ఆశయాలకు అందరూ పునరంకితం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. 200 సంవత్సరాల క్రితం సమాజంలో ఉన్న అస్పృశ్యత, అంటరానితనం, వర్ణ వ్యవస్థలు, స్త్రీ విద్యకు అవకాశం లేని పరిస్థితుల్లో ఆయన సమాజంలో ఒక విప్లవాన్ని తీసుకొచ్చారని అన్నారు. భారతదేశంలో సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చిన తొలి వ్యక్తి జ్యోతిబా పూలేను సామాజిక సంస్కరణ విప్లవ పితామహుడిగా మనమందరం కొనియాడుతామని అన్నారు. విద్య, అవగాహన లేకపోవడం, స్త్రీలు బాగా వెనుకబడి ఉండటం గమనించి ఆయన వాటిపై ప్రత్యేక దష్టి సారించారని చెప్పారు. విద్య, స్త్రీ విద్య, బాల్య వివాహాల నిర్మూలన కోసం ఆయన సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి సత్యాన్ని శోధించమని, సాంఘిక దురాచారాలకు దూరంగా ఉండమని ప్రజల్లోకి సందేశం తీసుకెళ్లారని అన్నారు. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేకు చదువు చెప్పించారని, దేశంలోనే బాలికలకు సంబంధించి అతిపెద్ద రెండో పాఠశాలను స్థాపించి స్త్రీ విద్యకు పాటుపడ్డారని తెలిపారు. బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాల కింద 508 మందికి రూ. 11.77 కోట్లు ఇస్తున్నామని వెల్లడించారు. అంబేద్కర్ భవన్ కోసం రూ. రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. ఎస్సీ వసతి గృహాలకు రూ.7 కోట్లు వచ్చాయని, బీసీ వసతి గృహాల మరమ్మతులకు డిఎంఎఫ్ నుండి రూ. 50 లక్షల వరకు ప్రతిపాదనలు పంపామని, ఎంపీ నిధుల నుండి రూ.కోటి ఇవ్వగా అది కేంద్ర ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉందని వివరించారు. కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే కుల వివక్షను రూపుమాపాలనే లక్ష్యంతో పనిచేశారని అన్నారు. కుల, లింగ భేదాలు లేకుండా అన్ని రంగాలు సమానంగా ఉండేలా పోరాడిన వ్యక్తి ఆయన అని కొనియాడారు. విద్యకు ప్రోత్సాహం ఇచ్చి అందరినీ చైతన్యవంతులను చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఒక స్థాయికి తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి పూలే అని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడా జ్యోతిబా పూలేను తన గురువుగా చెప్పుకున్నారని గుర్తు చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే 9 నెలల వయస్సులోనే తల్లి చనిపోయారని, ఆర్థిక సమస్యల వల్ల ఆయన చదువుకోలేకపోయారని అన్నారు. ఆయన తెలివితేటలను గుర్తించి ఇతరులు ఆయనకు విద్యాబుద్ధులు నేర్పారని చెప్పారు. ఆ రోజుల్లో సమాజంలో అంటరానితనం, కుల వ్యవస్థ, బాల్య వివాహాలు, నిరక్షరాస్యత నిర్మూలనకు ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఆయన బాల్య వివాహాలను నిర్మూలించి, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నుండి బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వారికి, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాల కింద 508 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన రూ. 11 .77 కోట్ల చెక్కును కలెక్టర్, కర్నూలు ఎంపీ, పాణ్యం ఎమ్మెల్యేలు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కెఇ. ప్రభాకర్, రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయ్, బోయ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మురళి, బోయ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, కురువ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరాముడు, నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్, వాల్మీకి సంఘం స్టేట్ డైరెక్టర్ సంజమ్మ, రాష్ట్ర దళిత సమైక్య అధ్యక్షుడు శ్రీనివాసులు, వివిధ సంఘాల బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాల్సిందే...

- ముస్లిం ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ముస్లిం పర్సనల్‌లా బోర్డు జెఏసి పిలుపు మేరకు శుక్రవారం కర్నూలు నగరంలోని వివిధ మసీదుల వద్ద మానవహారం నిర్వహించారు. ముస్లిం జెఏసి ప్రజా సంఘాల కన్వీనర్ జాకీర్ మౌలానా రష్ది, ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షులు పి.ఇక్బాల్ హుస్సేన్, నగర కార్యదర్శి ఎస్ ఎండి షరీఫ్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డి.అబ్దుల్ దేశాయ్, సిపిఎం నాయకులు ఖలీల్ అహ్మద్, అబ్దుల్ సలాం, జమాతే ఇస్లాం ఏ హింద్ నాయకులు మునీర్ అహ్మద్, యాఖుబ్‌బాయి, సర్దార్ ఖాన్, ఇస్మాయిల్, అన్వర్‌బాష, ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ నాయకులు ఎంఎ హమీద్, అన్వర్‌బాష తదితరులు మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొండిగా, నిరంకుశంగా బిల్లును ప్రవేశపెట్టి తమ మెజారిటీ బలంతో పాస్ చేయించుకోవడం దుర్మార్గమని విమర్శించారు. ముస్లిం మైనారిటీలు, న్యాయ నిపుణులు, ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, ప్రజాతంత్ర ఉద్యమకారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలతో పాటు రాజ్యాంగ నిపుణులు తీవ్రంగా ఖండిస్తున్నప్పటికీ, ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో ఈ బిల్లును తీసుకువచ్చి ముస్లిం మైనారిటీల ఆస్తులను కబ్జా చేయాలని కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని జనసేన, టిడిపి కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జనసేన, టిడిపిలోని ముస్లిం మైనారిటీ నాయకులు తమ అధినేతలపై ఒత్తిడి తెచ్చి, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, తమిళనాడులో స్టాలిన్, కేరళలో పినరయి విజయన్ ఇతర రాష్ట్రాల మాదిరిగా ఈ బిల్లును రాష్ట్రంలో అమలు చేయబోమని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయించాలని డిమాండ్ చేశారు. అలా చేయలేని పక్షంలో మైనారిటీ నాయకులందరూ తమ రాజకీయ, పార్టీ పదవులకు రాజీనామా చేసి ప్రజా ఉద్యమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలా చేయకపోతే వారిని కూడా ఆర్ఎస్ఎస్, బిజెపితో సమానంగా చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. గుడ్డిగా మద్దతు తెలుపుతున్న ప్రజలు, ఓటర్లు కూడా కేంద్ర, రాష్ట్ర పాలకుల కుట్రలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఉద్యమాలలో దేశంలోని యువతీ యువకులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు, లౌకికవాదులు, ప్రజాతంత్రవాదులు కలిసి రావాలని, కేంద్ర ప్రభుత్వం క్రైస్తవులు, ముస్లింలకు వ్యతిరేకంగా చేస్తున్న చట్టాలను మూకుమ్మడిగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జామియా మసీదు, ఖుబ్సూరత్ మసీదు, మౌలామసీద్, కర్బలా మసీదు, బుడన్ ఖాన్ (ఖాయుం ఖాన్) మసీదు తదితర ప్రాంతాలలో నిరసన తెలిపారు.



నిరసన చేపడుతున్న ముస్లింలు

నేడు కోన వెంకటేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని కృష్ణదొడ్డిలో కోన వెంకటేశ్వర స్వామి రథోత్సవం, సిబెళగల్‌లో పడమటి ఆంజనేయ స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పెద్దలు, గ్రామ పెద్దలు గురువారం పేర్కొన్నారు. సిబెళగల్ లో శనివారం సాయంత్రం ఐదు గంటలకు, కృష్ణ దొడ్డిలో ఆదివారం తెల్లారి మూడు గంటలకు వైభవంగా సాగుతాయని తెలిపారు.





ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఉర్దూ వర్సిటీకి భవనాలు అప్పగించొద్దు

క్లస్టర్ వర్సిటీ ఎదుట విద్యార్థులు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు సంబంధించిన భవనాలను ఉర్దూ వర్సిటీకి అప్పగించరాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లా రంగప్ప ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుతో ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప మాట్లాడుతూ ఫర్ మెన్ భవనాలను ఉర్దూ యూనివర్సిటీకి ఇవ్వాలని ఉన్నత విద్యా అధికారులు ఆదేశాలు ఇవ్వటం సరైనది కాదన్నారు. ఎందుకంటే కొత్తగా నిర్మించిన రూసో భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. వాటిలో సరైన వసతులు లేవనిఅన్నారు. దానితోపాటు ఈ రూసా భవనాలలో ఫర్ మెన్ మార్చటం ఇప్పుడు ఉన్న పాత భవనాలు ఉర్దూ యూనివర్సిటీకి ఇస్తే రాబోయే విద్యా సంవత్సరంలో ఫర్ మెన్ విద్యార్థులకు హాస్టల్ వసతి ఉండదన్నారు. దీని ప్రభావం అడ్మిషన్లపై పడుతుందన్నారు. ఒకే కాంపౌండ్ లో రెండు యూనివర్సిటీలు నిర్వహించటం సరైన వైఖరి కాదన్నారు. ఈ విధంగా చేయటం వల్ల యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తినే ప్రమాదం కూడా ఉందన్నారు. తక్షణమే ఫర్ మెన్ డిగ్రీ కళాశాల పాత భవనాలను ఉర్దూ యూనివర్సిటీ కి అప్పగించాలన్న నిర్ణయాన్ని క్లస్టర్ యూనివర్సిటీ అధికారులు, ఉన్నత విద్యా స్థాయి మండలి అధికారులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2025 -26 ప్రారంభమయ్యే విద్యా సంవత్సరంలో ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ , పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కోర్సులలో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిఉదయ్ జిల్లా సహాయ కార్యదర్శులు అంజి, అమర్ జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ నగర నాయకులు పృథ్వి, హరి, పిఎస్ఎన్ నాయకులు మనోహర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త జ్యోతిబాపూలే

ఆర్‌విఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గురు శేఖర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమాజంలో పెనుమార్పులు తీసుకువచ్చిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే అని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ అన్నారు. మహత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఆవిఎస్ ఆధ్వర్యంలో బిర్లాగేట్ వద్ద ఆయన విగ్రహానికి కర్నూలు జిల్లా ట్రెజరర్ సిహెచ్. శ్రీనివాసులు, ఓల్డ్ సిటీ కార్యదర్శి జయమ్మ, న్యూ సిటీ అధ్యక్షుడు రాముడు, కార్యదర్శి శేషాద్రి, జిల్లా కమిటీ సభ్యులు సి. ఎల్లయ్య, రమణ, నగర నాయకులు క్రెన్న, మద్దిలేటి, శ్రీను, మధు, వీరేష్‌లు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.సి. గురు శేఖర్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారుడిగా, సంఘ సేవకుడిగా కుల వివక్షకు వ్యతిరేకంగా కోట్లాది మంది పేద, అణగారిన ప్రజల హక్కుల కోసం తుది శ్వాస వరకు పోరాడారని కొనియాడారు. దేశమనే దేహానికి శూద్రులే ప్రాణమని, రక్తనాళాల వంటి వారని ఆయన గట్టిగా చాటి చెప్పారని అన్నారు. తరతరాలుగా కులం పేరుతో అణచివేతకు గురైన దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి సాధికారత కల్పనకు కషి చేసిన గొప్ప సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అనిపేర్కొన్నారు.1873లో సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి ఎన్నో సేవలు అందించిన మహాత్మునిగా ఆయన ఖ్యాతి గడించారని గురు శేఖర్ తెలిపారు. ప్రతి కులానికి జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ పూలే అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి సూచించారని గుర్తు చేశారు. అసమానతలకు విద్య, ఉద్యోగ అవకాశాలు లేనివారికి రిజర్వేషన్లు కల్పించాలని ఆనాడే ఆయన పోరాడి ముందుచూపు ప్రదర్శించారని అన్నారు. గ్రీకు మహాకవి హోమర్ మాటల స్ఫూర్తితో శూద్ర, అతిశూద్ర జాతుల విముక్తి కోసం పూలే జీవితాంతం ధృఢంగా పోరాడారని వివరించారు. కుల వివక్షను ఎదిరించి బడుగు వర్గాల హక్కుల కోసం కషి చేసిన మహనీయుడిగా పూలే పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నేటి తరం వారి ఆశయాలను గుర్తుపెట్టుకుని, వారి పోరాట స్ఫూర్తిని నింపుకొని ముందుకు సాగాలన్నారు.



ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కళారత్న పురస్కారం పొందిన పత్తి ఓబులయ్యను, ఉగాది పురస్కారం పొందిన ప్రముఖ కథా రచయిత ఎస్‌డివి అజీజ్‌లను ప్రజాహితవేదిక కమిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. కర్నూలు టీజీవి కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి జరిగింది.ప్రజా హంస కళారత్న అవార్డు గ్రహీతలు పత్తి ఓబులయ్య, ఎస్‌డిబి అజీజ్‌ను సన్మానం చేశారు. ప్రజాహిత వేదిక కన్వీనర్ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయడానికి సంస్థను స్థాపించామని తెలిపారు. అందులో భాగంగానే నాటక సాంస్కృతిక కళా రంగాలలో ఎంతగానో సేవలు అందించిన పత్తి ఓబులయ్యకు, ఎస్ డి బి అజీజ్ ను సన్మానిస్తున్నామని తెలిపారు. వెంకటస్వామి, బడే సాహెబ్ మహమ్మద్ మియా, బాల వెంకటేశ్వర్లు తదితర ప్రజాహిత వేదిక సభ్యులు పాల్గొన్నారు.



యువత చదువుతో పాటు నైపుణ్యం పెంచుకోవాలి

ఎం.పి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

చదువుతో పాటు యువత నైపుణ్యాలను పెంచుకోవాలని, అప్పుడే ఈ పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగ అవకాశాలు అందుకోగలుగుతారని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో 21 సెంచరీ ఐఎఎస్ అకాడమీ హైదరాబాద్ వారి సహకారంతో నగర శివారులోని కెవి సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నిష్ణాతులైన శిక్షకుల చేత కర్నూలు జిల్లాలోని అన్ని డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు , 21 సెంచరీ ఐఎఎస్ అకాడమీ వారిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే కళాశాలల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక త్వరలో నిర్వహించబోయే డిఎస్‌సి పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపి తెలిపారు. డిఎస్‌సి పరీక్షల శిక్షణకు ఆన్ లైన్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా యువజన సంక్షేమ అధికారి సెట్కూరు సిఇఒ వేణుగోపాల్ మాట్లాడుతూ త్వరలో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పాఠశాల విద్యా శాఖ సహకారంతో వర్చువల్ (ఆన్ లైన్) తరగతులను 10 వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పోటీ పరీక్షలు, ఉపాధి అవకాశాల పై అవగాహనా సదస్సులు నిర్వహిస్తామన్నారు. 21 సెంచరీ ఐఎఎస్ అకాడమీ ప్రతినిధి కృష్ణ ప్రసాద్, కెవి.సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కెవి.సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కన్న కుమార్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యామ్ బాబు పాల్గొన్నారు.



కెరీర్‌గైడెన్స్ పుస్తకాలను ఆవిష్కరిసుత్న బస్తిపాటి నాగరాజు



విద్యార్థినికి బ్లాక్ బెల్ట్ ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, భూపతిరావు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్


విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. కర్నూలు ఇండోర్ స్టేడియంలో తైక్వాండో క్రీడాకారులకు శిక్షకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్టు ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్‌శంకర్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు బ్లాక్ బెల్టులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తైక్వాండో మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తైక్వాండోలో బ్లాక్ బెల్టు సాధించిన మహిళ నలుగురు పురుషులను ఎదురించే ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉంటుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగాల్లో రిజర్వేషన్ అవకాశాలు కూడా వస్తాయని తెలిపారు. భారతదేశంలో అత్యంత ధనవంతుల్లో క్రికెట్ క్రీడాకారులు ఉన్నారని వారు క్రీడల అభివృద్ధికి కృషి చేయడం శుభపరిణామం అన్నారు. పేద క్రీడాకారులకు ప్రభుత్వాలతో పాటు ధనవంతులు సైతం సహాయం చేయాలని కోరారు. ప్రపంచంలో అధిక జనభా ఉన్న భారతదేశం ఒలింపిక్ క్రీడల్లో పతకాలు తక్కువగా వస్తున్నాయని క్రీడాకారులు ఎక్కువ పతకాలు సాధించి దేశానికి పేరు తీసుకుని రావాలని కోరారు. క్రీడాకారులు మంచి ఆహారపు అలవాట్లు కలిగిఉండి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఆటోను ఢీకొట్టిన బైకు

ప్రజాశక్తి-సి బెళగల్

కోడుమూరు మండలం పులకుర్తి శివారు ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆటోను బైకు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరూ వ్యక్తులు మృతి చెందారు. గోనెగండ్ల మండలం ఆల్వాలకు చెందిన దేవరాజు (30)బోయ హర్ష (20) లు బైకు మీద పులకుర్తిలో పనులు ముగించుకొని ఆల్వాలకు బయలు దేరారు. గూడూరు మార్కెట్‌కు కూరగాయలు వేసుకొని వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న బైకు ఢీకొట్టడంతో రోడ్డు ప్రక్కన ముళ్ల పొదల్లోకి ఎగిరి పడ్డారు. ఇందులో హర్ష అక్కడికక్కడే మతి చెందారు. కోమాలో ఉన్న దేవరాజును ఆసుపత్రికి తరలించాక మృతిచెందాడు. హర్ష అనే యువకుడికి వివాహం కాలేదు. దేవరాజుకు భార్య సజీవమ్మ, ఇద్దరూ కుమారులు ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన వ్యక్తులు ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



విద్యార్థులతో ఉన్న డిఇఒ

చదువుతో బంగారు భవిష్యత్తుకు


- డిఇఒ శ్యామ్యుల్ పాల్

ప్రజాశక్తి - కౌతాళం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాట వేసేది చదువు ఒక్కటేనని డిఇఒ ఎస్.శ్యాముల్ పాల్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని కర్ణాటక సరిహద్దు మండలం కౌతాళంలో ఆకస్మికంగా పర్యటించారు. వలసల ద్వారా విద్యకు దూరమవుతున్న డ్రాప్ అవుట్ విద్యార్థులతో మమేకమై విద్యా ప్రగతిని చర్చించారు. మళ్లీ చదువుతామని, బడిలో చేర్పించే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంఆర్‌సి భవనంలో విద్యార్థులతో, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. 16 మంది విద్యార్థులను బడిలో చేర్పించారు. అనంతరం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను పరిశీలించి 9వ తరగతి విద్యార్థినులకు పాఠాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. ప్రతి సబ్జెక్టు గురించి అడుగుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు అవగాహన చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. నేరుగా 9వ తరగతి గదిలోకి వెళ్లి కింద కూర్చుని పుస్తకాలు తెరిచి పాఠ్యాంశాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేశారు. 10వ తరగతి ఎలా అర్థం చేసుకోవాలి, ప్రణాళికలు ఎలా ఉండాలి, అర్థమయ్యేలా సులభంగా ఎలా చదవాలో వివరించారు. కౌమార దశలో ఎటువంటి మానసిక సంఘర్షణ, ఒత్తిడి లేకుండా భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలో విద్యార్థులతో మమేకమై పెద్దన్నలా సలహా ఇచ్చారు. విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. అక్కడికక్కడే సిబ్బందిని సమావేశపరిచి నైపుణ్యవంతమైన బోధన ఎలా చేయాలో దిశనిర్దేశం చేశారు. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని, ఇష్టపడి చదివి ఉత్తమమైన ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు.

సామూహిక వ్యూహాల ద్వారా
ఏకమైన 25 జంటలు

- తాళి బొట్లు, మెట్టెలు ఇచ్చిన శ్రీనివాస్ రెడ్డి



ఆశీర్వదిస్తున్న రాఘవేంద్ర రెడ్డి, ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

వేదమంత్రాలు, అగ్ని సాక్షిగా, ఏడడుగులు నడిచి, పీఠాధిపతులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు, గ్రామపెద్దలు ఆశీస్సులతో 25 జంటలు ఏకమయ్యాయి. ఈ మహత్తరమైన కార్యక్రమం మండలంలోని మదిరే, పొదలకుంట గ్రామంలో ఉటకనూరు బసవేశ్వర స్వామి మఠం పీఠాధిపతి పంపారెడ్డి తాత ఆధ్వర్యంలో ఘనంగా 25 పేద జంటలకు సామూహిక వివాహాలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి సోదరుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి హాజరై 25 జంటలకు తాళిబొట్లు, కాళ్ల మెట్టెలు విరాళంగా ఇచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సామూహిక వివాహ వేడుకల్లో వివిధ మఠాల నుంచి పీఠాధిపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ మఠం పెద్దలు శాలువా, పూలమాలతో సన్మానించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, ఉరుకుంద ట్రస్టు బోర్డ్ మాజీ ఛైర్మన్ బాపురం శివ మోహన్ రెడ్డి, జిల్లా కార్యనిర్వహణాధికారి కోట్రేష్ గౌడ్, రమేష్ గౌడ్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు, సిద్ధు, ఈరప్ప, దొడ్డన్న గౌడ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మూహిక వివాహాలకు వివిధ రూపాల్లో సహాయ, సహకారాలు అందించిన టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జ్ రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, సురేష్ నాయుడు, అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, గిరి, జనసేన మంత్రాలయం ఇన్‌ఛార్జ్ లక్ష్మన్న, సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నూతన జంటలను ఆశీర్వదిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

రైతును నిర్లక్ష్యం చేస్తే పుట్టగతులుండవు

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని

ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతును నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కల్లుబావి వీధిలో రైతు సంఘం 90వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మండల కమిటీ సభ్యుడు కె.రామదాసు అధ్యక్షతన సంఘం జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశులు మాట్లాడారు. అఖిల భారత్ కిసాన్ సభ రైతుసంఘం ఏర్పడి 90 సంవత్సరాలు పూర్తయ్యిందన్నారు. బ్రిటీష్ వలస పాలన, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా, పంటలకు గిట్టుబాటు ధరల కోసం సంఘం పోరాడిందని తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం బ్యాంకు రుణాలు, విత్తనాలు, ఎరువుల సబ్సిడీ, పంట నష్టపరిహారం, బీమా సౌకర్యం, పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాడినట్లు తెలిపారు. కార్పొరేట్ల నుంచి వ్యవసాయాన్ని కాపాడాలని పోరాడుతున్నా ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం కత్తి మీద సాము లాంటిదని, రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. గత పదేళ్ల నుంచి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రైతుల భూములను కారుచౌకగా కార్పొరేట్లకు అప్పజెప్పి రైతులను వ్యవసాయం నుంచి బయటకు వెళ్లగొట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఉచిత విద్యుత్ ఎత్తివేతకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి సిద్ధ పడిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుసమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. రైతు వ్యతిరేక విధానాలకు, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా అన్ని రైతుసంఘాలూ కలిసికట్టుగా దేశవ్యాప్తంగా పోరాడుతున్నట్లు తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు రామాంజినేయులు, రైతులు ఉన్నారు. **ఆస్పరి**లోని రైతుసంఘం కార్యాలయం ముందు రైతు సంఘం మండల అధ్యక్షులు మధు రెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. రైతు సంఘం మండల కార్యదర్శి రంగస్వామి, రైతులు రామాంజనేయులు, తిప్పన్న, ఈరన్న, కుమార్, ఎర్రిస్వామి, రవి, రాము పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని సుందరయ్య భవన్ వద్ద జెండా ఆవిష్కరణను రైతు సంఘం నాయకులు రైతుసంఘం నాయకులు ఎం.అబ్దుల్లా, యు.లక్ష్మీ నరసయ్య ఆవిష్కరించారు. సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, రైతుసంఘం నాయకులు రమేష్, కృష్ణ, నామాల రాముడు, సుభాన్, పరమేష్, సురేష్, బజారి, తిమ్మయ్య పాల్గొన్నారు. **నందవరం :** రైతు సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు రైతు సంఘం మండల నాయకులు దేవపుత్ర తెలిపారు. రాయచోటి గ్రామంలో రైతుసంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు దేవపుత్ర మాట్లాడారు. ప్రభుత్వాలు రైతులపై అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ రైతులకు అండగా నిలిచిందని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర, పంటల బీమా, పంటల నష్టపరిహారం సమస్యలపై పోరాటం చేస్తూ రైతులకు న్యాయం జరిగేలా రైతు సంఘం పోరాటాలు చేసిందని తెలిపారు. కిష్టప్ప, గోవిందు, నాగరాజు, శాంతప్ప, పెద్ద రామలింగప్ప, సంజప్ప పాల్గొన్నారు. **ఆలూరు** జ్యోతిబసు భవనంలో ఏపి రైతు సంఘం మండల కార్యదర్శి యు.ఈరన్న అధ్యక్షతన నిర్వహించారు. రైతుసంఘం సీనియర్ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరణ చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, ఆలూరు రైతు సంఘం సీనియర్ నాయకులు పరమేష్ రెడ్డి, సేకన్న, వీరేష్ గౌడ్, ఈరన్న, రంగస్వామి పాల్గొన్నారు.



ఆదోనిలో నినాదాలు చేస్తున్న నాయకులు



ఆలూరులో జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు



ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు



నందవరంలో




ఆస్పరిలో

కష్టపడే వారికే గుర్తింపు

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపిలో కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని, అలాంటి కార్యకర్తలకు జగన్ కచ్చితంగా గుర్తించి న్యాయం చేస్తారని అందుకు తానే నిదర్శనమని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. శుక్రవారం మండలంలోని కుందనగుర్తి గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు నాగప్ప ఆహ్వానం మేరకు నాగప్ప కుమారుడు ప్రతాప్ వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే వివాహ వేడుకలకు వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, గుంతకల్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని పలు మండలాల ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, వైసిపి కన్వీనర్లు, సొసైటీ మాజీ ఛైర్మన్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి సోషల్ మీడియా సభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు వివాహ వేడుకలకు హాజరయ్యారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

రాత్రయితే ఆ కాలనీలో చీకటే..!

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి వర్షం కురిసినా, ఈదురు గాలులు వీచినా, విద్యుత్ కోత విధించడం వర్షాలు ప్రారంభం కాకముందే మొదలైందని శివారు కాలనీవాసులు వాపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని చెబుతున్నారు.

వెలుగని వీధి దీపాలు : రాత్రి అయితే చాలు ఆ కాలనీ కారు చీకటే.. అటు వైపు వెళ్లాలంటేనే భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. ట్యాక్స్ వసూలుపై ఉన్న శ్రద్ధ సౌకర్యాల కల్పనపై చూపడం లేదని పలువురు పేర్కొంటున్నారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డు, రోషన్ గార్డెన్స్, తిరుమల నగర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రహదారి ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగని పరిస్థితి. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు ఉన్నా లైట్లు అమర్చలేదని స్థానికులు వాపోతున్నారు. కొన్నేళ్ల నుంచి విద్యుత్ స్తంభాలకు విద్యుద్దీపాలు లేక రాత్రిపూట నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. బైపాస్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు రాత్రి వీధులన్నీ చీకటి మయంగా మారుతున్నాయి. దొంగతనాలు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాదు, కర్నూలు, ఎమ్మిగనూరుకు ఈ రోడ్డు కూడా వాహన రాకపోకలు సాగుతున్నాయి. చీకటిగా ఉండడం వల్ల రోడ్డు పక్కన గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో వ్యాపారులు, ఉద్యోగులు అధికంగా నివసిస్తున్నారు. చీకటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే లేరంటూ ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై చర్చించగా అధికారులు మాత్రం 'అప్పుడు వేస్తాం.. ఇప్పుడు వేస్తాం' అంటూ కాలయాపన చేస్తున్నారు. కాలనీ వాసులు, వ్యాపారులు రాత్రి పూట రోడ్డు దాటాలంటే, రోడ్డుమీద నడవాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యుత్ లైట్లు అమర్చడంలో సంబంధిత అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక జనం ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఉన్నా పరిస్థితి ఇలా ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు రోడ్డు వెంట వీధిలైట్లు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.



చీకటిగా ఉన్న కాలనీ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామి రెడ్డి

ఆస్పత్రికి వచ్చే వారికి సకాలంలో వైద్యమందాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామి రెడ్డి

ప్రజాశక్తి - చిప్పగిరి


ప్రభుత్వాస్పత్రులకు ఆరోగ్యాలు బాగోలేక వైద్యం పొందడానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్యం అందించే బాధ్యత అందరిపైనా ఉందని డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామి రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం చిప్పగిరి ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న గర్భిణులు, బాలింతలను వైద్యం ఎలా అందుతుందోనని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు అఫ్రోజ్ జహాన్, పార్వతమ్మ ఆధ్వర్యంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందు వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య సిబ్బంది చేస్తున్న సర్వే పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎఎన్ఎంలు పద్మావతి, విమలాదేవి, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమఠం పీఠాధిపతుల పుట్టినరోజు

- పర్యావరణ పరిరక్షణకు తులసి మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల పుట్టినరోజు శ్రీమఠం సిబ్బంది, సంస్కృత విద్యాపీఠం ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామస్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు స్వామీజీకి తైల అభ్యంజనంతో స్నానాలు చేయించారు. ఈ సందర్భంగా శ్రీమఠంలో విశేష పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణలో మంగళ హారతులు ఇచ్చారు. స్థానిక వ్యాపారి మధు శ్రీమఠంలో స్వామీజీ వారి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక సేవలు చేయించి స్వామీజీకి వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌తో తులాభారం నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా భావించి సస్య రక్షణను కాపాడాలని కోరారు. అనంతరం తులసి వనం నుంచి తులసి మొక్కల పంపిణీ చేసి పచ్చదనాన్ని కాపాడాలని కోరారు. సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరం ప్రారంభించగా యువత రక్తదానం చేశారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.



పీఠాధిపతులను సన్మానిస్తున్న దృశ్యం

'వక్ఫ్' సవరణపై ఆందోళన : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని

రాజ్యాంగ విరుద్ధ వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్ హెచ్చరించారు. శుక్రవారం మాసా మసీద్ కాలనీలో మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ, భారత రాజ్యాంగ పరిరక్షణకు సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార ఆందోళన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, సిపిఐ సీనియర్ నాయకులు షేక్షావలీ, సహాయ కార్యదర్శి విజయ్, ఇన్సాఫ్ కమిటీ నాయకులు షాషావలీ హాజరయ్యారు.

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసన

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసనను రాయలసీమ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో దుల్హాపైల్వాన్ మసీదులో నమాజ్ అనంతరం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టినట్లు మసీద్ ముతావల్లి జిక్రియా తెలిపారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొస్తోందని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. దేశంలోని ముస్లింలను అణిచివేయడానికి వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వక్ఫ్ చట్టాన్ని మార్చి వారికి అనుకూలంగా చేసుకుని అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ముస్లింలకు అండగా ఉంటానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట నిలబట్టుకోలేక ద్రోహం చేశారన్నారు. టిడిపి ముస్లిం, మైనారిటీ నాయకులు భేషరతుగా ఆ పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి, టిడిపి నాయకులు బయటకు వచ్చి ఆందోళన చేపట్టాలని కోరారు. స్థానికంగా ఉన్న టిడిపి నాయకులు ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. **కోసిగి**లో సిపిఐ మండల కార్యదర్శి గోపాల్, కాంగ్రెస్ మైనారిటీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.జిలాని ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఈరేష్, డిహెచ్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఓంకార స్వామి, కాంగ్రెస్ మండల నాయకులు తాయన్న, బాబు, నరసింహులు పాల్గొన్నారు.



ఆదోనిలో నిరసన చేపడుతున్న ముస్లింలు




కోసిగిలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

పూలే సేవలు చిరస్మరణీయం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

బడుగు, బలహీన వర్గాల చైతన్యానికి అహర్నిశలు కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం వారి కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రముఖ సంఘసంస్కర్త, సమాజంలోని వర్ణ, కుల, లింగ వివక్షపై గళమెత్తి అంటరానితనం రూపుమాపడానికి ప్రజల్లో చైతన్యం తెచ్చిన దార్శనికుడు, సమసమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి బడుగు బలహీనర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని దారపోసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని కొనియాడారు.

బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో : బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్, ఉపాధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ బి.మల్లేశ్వరప్ప, జాయింట్ సెక్రటరీ దీపక్ కుమార్, తాయప్ప, విశ్రాంత ఉద్యోగి అమలానాథ్, ఎస్ఎల్.మహాదేవప్ప ఉన్నారు. అలాగే ఎంఆర్‌పిఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ నాయకత్వం బలపరుస్తూ మాజీ మండల గౌరవాధ్యక్షులు బైచిగేరి తిమ్మన్న మాదిగ, దిబ్బనకల్ ఉసేనప్ప మాదిగ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ఎమ్మిగనూరు** మండలంలోని మాచుమాను దొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి రాజు మాట్లాడారు. విద్యార్థులందరూ ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నత చదువులు చదివి దేశానికి ఉపయోగపడాలని కోరారు. ముఖ్య అతిథిగా పాఠశాల కమిటీ ఛైర్మన్ మల్లికార్జున, పాఠశాల సిబ్బంది వీరేష్ రాజు, మునిస్వామి, అపర్ణ లత పాల్గొన్నారు. **ఆలూరు** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఘనేశ్వర్, వైస్ ప్రిన్సిపల్ కె.మాధవి, అధ్యాపకులు సుశీల, లక్ష్మి నరసమ్మ, రాఘవేంద్ర, ముద్దప్ప, సిబ్బంది శేఖర్, ప్రణయ్, విద్యార్థులు పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని బస్టాండ్ ప్రాంగణంలో సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, ఆటో యూనియన్ నాయకులు వేణు, హనుమన్న మాట్లాడారు. దేశంలో అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారని తెలిపారు. స్త్రీ జనోద్ధరణ, బాలికా సంరక్షణ, బాలిక విద్య కోసం కృషి చేసి వారి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఎపిడికెఎస్ నాయకులు మారేష్, ఆటో యూనియన్ నాయకులు బాబు, రాజు, వలీ, సురేష్, మున్నా, మునెప్ప, రాకేష్, రంగస్వామి పాల్గొన్నారు. **హోళగుంద**లోని సీజనల్ హాస్టల్‌లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు, ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య మండల అధ్యక్షులు నల్ల మల్లేష్, దళిత నాయకులు హనుమంతు, లక్ష్మప్ప, శివ సిద్ధప్ప, శేఖర్, మాల మల్లేష్, బుడగ జంగాల నాయకులు రంగన్న, జంబయ్య పాల్గొన్నారు.



ఆదోనిలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉమాపతి నాయుడు



ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు



ఆలూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం



గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో
సేవాభావం, ఆత్మస్థైర్యం పెంపు

-ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహినా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల విద్యార్థుల్లో సామాజిక, సేవాభావం ఆత్మస్థైర్యం, నైతిక విలువలు పెంపొందుతాయని ఏపి మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలోని ఏపి మోడల్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై అవగాహన కల్పించారు. సంస్థ ముఖ్య ఉద్దేశం మానవసేవయే మాధవసేవ అనే తత్వంతో విద్యార్థుల ప్రవర్తనలో మంచి మార్పులతో చైతన్యవంతులుగా ఎదగడానికి దోహదపడుతుందని అన్నారు. అతి త్వరలో పిఎంశ్రీ ఫేజ్-2 కింద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎపిజె అబ్దుల్ కలాం యూనిట్ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 1 నుంచి ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభం కాగా అందరూ విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ప్రోత్సహించాలని ప్రిన్సిపల్ కోరారు. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఇంటర్మీడియట్ తర్వాత హాజరయ్యే కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు తయారు చేసే విధంగా రాష్ట్ర విద్యాశాఖ వారితో నిర్వహిస్తున్న అసెస్‌మెంట్-1 పరీక్ష మోడల్ స్కూల్‌లో నిర్వహించామన్నారు. మిగిలిన నాలుగు అసెస్‌మెంట్స్ ఈనెల 15, 17, 19, 22వ తేదీల్లో పాఠశాల వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. గైర్హాజరైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ : ఏపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి అందిన పుస్తకాలను ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శశికళ, సమీర్, రజాక్ ప్రతి విద్యార్థికి 12 నోటు పుస్తకాల చొప్పున పంపిణీ చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ గ్రామానికి చెందిన తలారి లక్ష్మన్న (41) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు, పోలీసుల వివరాల మేరకు... మృతుడు లక్ష్మన్న గొర్రెలు మేపుతూ కుటుంబాన్ని పోషిస్తూ జీవించేవారు. గత కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతుండే వారు. అలాగే గొర్రెల కొనుగోలుకు రూ.5 లక్షలు అప్పులు చేయడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదన, కడుపు నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది వేప చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సామాజిక విప్లవకారుడు మహాత్మా పూలే

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా పూలే జయంతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అసమానతలతో, ఆర్థిక, సామాజిక దోపిడీ తో ఉన్న సమాజ గతిని ప్రశ్నించడం తోపాటు, వాటిని సమూలంగా పరిష్కరించడం కోసం పరితపించి పనిచేసిన సామాజిక విప్లవకారుడు మహాత్మా పూలే అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి కొనియాడారు. శుక్రవారం కర్నూలు నగరంలోని బిర్లాగేట్, దండి సత్యాగ్రహ విగ్రహం వద్దవున్న రోజువారి కూలీల అడ్డాలో మహాత్మా పూలే జయంతి కార్యక్రమాన్ని కెవిపిఎస్, ఆర్‌విఎస్, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముందుగా చిత్రపటానికి పూల మాలవేసి శుభాకాంక్షలు తెలిపారు. దండి సత్యాగ్రహ విగ్రహం నుండి పూలే విగ్రహం దాకా ర్యాలీ నిర్వహించి పూలే విగ్రహానికి దండ వేసి జేజేలు పలికారు. ఆర్‌విఎస్ జిల్లా కార్యదర్శి గురుశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనందబాబు, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ, అలివేలమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటి సభ్యులు డి.విజయ, నగర అధ్యక్షులు రమణ, ఏసురాజు, ఐద్వా, ఎస్ఎఫ్ ఐ, డివైఎఫ్ఐ, ఆర్‌విఎస్ నగర కార్యదర్శుల పద్మ, సాయి ఉదయ్, ఉసేన్ బాష, శేషాద్రి, శ్రీనివాసులు నాయకులు చక్రపాణి, మధన గోపాల్, ఆంజనేయులు, ప్రదీప్, వేనమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



పూలే జయంతి సభలో మాట్లాడుతున్న కె.ప్రభాకర్‌రెడ్డి, ఎండి ఆనంద్‌బాబు, ఐద్వానాయకులు

మాతాశిశు సంక్షేమమే దేశ సౌభాగ్యం

వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం లోని పట్టణ ఆరోగ్యకేంద్రం కొత్తపేట ను శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ఎస్.అనీల్ కుమార్ తనిఖీ చేశారు. ఒపి విభాగం,మందుల గది , వ్యాక్సిన్ నిల్వ యంత్రాలను పరిశీలించారు. తదుపరి వారు 'జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం' సందర్భంగా జిల్లా వైద్య ,ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పి.శాంతి కళ ఆధ్వర్యంలో అక్కడే ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 2003 నుండి ప్రతి సంవత్సరం ఏపిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం మాతాశిశు సంక్షేమమే దేశ సౌభాగ్యం అనే నినాదం తో జరుపుకుంటున్నామని తెలిపారు. ఆరోగ్యకరమైన ప్రారంభం-ఆశాజనక భవిష్యత్తు అను నినాదంతో అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ పి.శాంతి కళ మాట్లాడుతూ ముఖ్యంగా తల్లీ బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ఈ కింది ఆరోగ్య సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణి ఆరోగ్య సేవలు ప్రాముఖ్యత గురించి



అవగాహన, నవజాత శిశు ఆరోగ్య సేవలు , వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత, మాతా శిశు మరణాలను తగ్గించుటపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యునిసిఫ్ కన్సల్టెంట్ నాగేంద్ర , డిపిఎంఒ డాక్టర్ ఉమా , డిఐఒ డాక్టర్ నాగప్రసాద్ బాబు , డెమో శ్రీనివాసులు శెట్టి , వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, డిపిఒ విజయరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి , ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి , మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత , ప్రోజెక్సనిస్ట్ ఖలీల్ , ఆరోగ్య కార్యకర్తలు , అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

ప్రసవానంతర జాగ్రత్తలపై అవగాహన

జిజిహెచ్ లో జాతీయ సురక్షిత మాతత్వ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ విభాగంలో గర్భిణులకు సరైన ఆరోగ్య సంరక్షణ, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తల్లి బిడ్డ ప్రసవంతరం క్షేమంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,



గర్భవతి ఉన్నప్పుడు తీసుకోవాల్సిన పోషకాహారం, ప్రమాద సూచికలు తెలుసుకోవడం, గవర్నమెంట్ ఇచ్చే పదార్థాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. హాస్పిటల్లోనే ప్రవాసాలు జరిగే విధంగా చూసుకోవాలన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ ముందుగానే గుర్తించి సరైన సమయంలో వైద్యం తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు. ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, గైనిక్ విభాగపు హెచ్ఒడి డాక్టర్ శ్రీలక్ష్మి, గైనిక్ విభాగపు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

31 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు, నంద్యాల మెడికల్ కాలేజీలు , గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ లు, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ 31 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ క్రింద 9 కేటగిరీలకు చెందిన పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులలో వివిధ టెక్నికల్ నాన్ టెక్నికల్ పోస్టుల నియమకాలకోసం 2023లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో మెరిట్ రోస్టర్ ప్రకారం ఎంపికైన 9 కేటగిరీల చెందిన మొత్తం 31 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వజన వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ మంజులరాణి, ఎఒలు లక్ష్మీ ప్రసన్న, రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేస్తున్న కెఎంసి ప్రిన్సిపల్ చిట్టినరసమ్మ

విద్యుత్ భవన్‌లో పూలేకు నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహాత్మజ్యోతిరావుపూలేకు కర్నూలు విద్యుత్ భవన్‌లో ఎస్ఇ ఎం.ఉమాపతి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. ఎఇ టెక్నికల్ పి.ఓబులేసు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చిన్న రాఘవులు, వైవిమహేశ్వర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కన్సల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.లత, ఎంఆర్‌టి డివిజన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎపిటిఎస్ అండ్ విజిలెన్స్ పి.నాగరాజు యాదవ్, ఉద్యోగ బృంద సిబ్బంది , నాయకులు జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు.

ఒకేషనల్ కాలేజీలో: కాంకర్ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వమించారు.కళాశాల కరస్పాండెంట్ కె.వేణుగోపాల్ ,మహాత్మ జ్యోతిరావు పూలే జీవిత విశేషాలను వివరించారు. జాతిపిత జ్యోతిరావు పూలే ఒక భారతీయ సామాజిక సంస్కర్త, సామాజిక జ్ఞానోదయం కలిగించిన వ్యక్తి, విప్లవాత్మక కార్యకర్త, ఆయన 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని పూణేలో జన్మించారు తెలిపారు.

జాతిపిత జ్యోతిరావు పూలే విద్యకు సహకారం: పూలే భార్య సావిత్రిబాయి 1848లో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించి, మహిళలకు విద్యను అందించడానికి కృషి చేసింది.

సత్యశోధక్ సమాజ్: సమాజంలో ప్రబలంగా ఉన్న మూఢనమ్మకాలను , కుల వ్యవస్థను నిర్మూలించడం లక్ష్యంగా 1873లో పూలే సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించడు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అణగారిని వర్గాల ఆశాజ్యోతి మహాత్మజ్యోతిరావు పూలే అని కర్నూలు టిడిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు పి.తిక్కారెడ్డి ఆదేశాల మేరకు జ్యోతి రావు పూలే 198 సంవత్సరం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి ప్రధాన కార్యదర్శి ఆకేపోగు ప్రభాకర్, బిసి నాయకులు మాధవస్వామి, బెస్త సుభాష్ చంద్రబోస్ ,విజయలక్ష్మి, నరసింహనాయుడు, డివిచంద్ర, తడకనపల్లె ఈశ్వరయ్య, నంద్యాల నాగేంద్ర, ధరూర్ జేమ్స్, బేతంకృష్ణుడు, శేషారెడ్డి, బజారన్న, లాయర్ ప్రసాద్, హనుమంతరాయ చౌదరి, బాలేశ్వర్‌రెడ్డి, శివశంకర్ కటారి శీను, వెంకటేశులు మొదలగు వారు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిని తొలగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్న ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్ ను వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం కర్నూల్ నగరంలో విద్యార్థి యువజన సంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాయలసీమ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, రాయలసీమ పరిరక్షణ పరిరక్షణ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగర్జునలు మాట్లాడారు. ఉన్నత విద్యామండలి పై కోన శశిదర్ , భరత్ గుప్తాల పెత్తనం తగ్గాలని, ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్న ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శిని తక్షణమే ఇంచార్జి విధుల్లో నుంచి తొలగించాలన్నారు. ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి ని కనీసం విశ్వావిద్యాలయ విసిలకు సైతం అపాయింట్మెంట్ ఇవ్వకుండా కళాశాల డైరెక్టర్ భరత్ గుప్తాతో మాట్లాడుకోవాలని చెప్పడం దారుణమన్నారు. ఉన్నత విద్యాశాఖ కు కోన శశిధర్ ముఖ్య కార్యదర్శిగా వ్యవహరించడం లేదన్నారు. గత ప్రభుత్వ పాలన లో ఉన్నత విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి కోట్ల రూపాయల అవినీతి చేసిన హేమచంద్ర రెడ్డి పై విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యాశాఖ ఎడి శ్రీనివాసులు సస్పెన్షన్

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్గా పనిచేస్తున్న శ్రీనివాసులును సస్పెన్షన్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు శుక్రవారం జారీ చేశారు. ఇటీవల కాలంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించడంతో మహిళలు శ్రీనివాసులు పై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. గతంలో కూడా ఆయన కొన్ని అవినీతి ఆరోపణ కేసుల్లో కూడా సస్పెండ్ అయ్యాడు.

ఎఐకెఎస్‌ను బలపరచండి

-కర్నూలు కలెక్టరేట్: రైతుల కోసం పోరాడిన ఎఐకెఎస్‌ను బలపరచాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.మధుసూదన్ అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఎఐకెఎస్ వేడుకలను నిర్వహించారు. మండల కార్యదర్శి ఎస్ మధుసూధన్ జండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నన్నూరు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిబాపూలే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమాజంలో ప్రతి ఒక్కరికి జ్యోతిబాపూలే ఆదర్శప్రాయుడని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే 199 వ జయంతి సందర్భంగా, కర్నూలు నగరంలో బిర్లా గేట్ దగ్గర పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబాపూలే అంటరానితనం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. కులవ్యవస్త నిర్మూలనకు అణగారిన వర్గాల సమానత్వ హక్కులకోసం సత్యసమాజ శోధక్ అనే సంస్థను ఏర్పాటు చేశారన్నారు. ఆయన భార్య సావిత్రి భాయ్ పూలే మహిళలకు విద్యను అందించడం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. పీడిత జాతికి విద్యను అందించడం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. 1848 వ సంవత్సరంలో బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యను ప్రోత్సహించారన్నారు. సమాజం ఆయనను ఎప్పటికీ గుర్తుంచు కుంటుందన్నారు. బిసి నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

